dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 23 09 మంగళవారం ఆగస్టు 2026

## ఉల్లిపాయలను కేవలం రూ.32కే

**వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ చౌక ఉల్లిపాయల విక్రయాలు**



**అమరావతి డీసీ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం కీలక ఉపశమనం ప్రకటించింది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ చౌక ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఉల్లితో పాటు చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్‌ను కూడా త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి వర్గాల కుటుంబాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

## ఫోక్సో కేసులో 20 ఏండ్ల జైలు

**చెన్నై డీసీ**

తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు మైనర్‌పై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రధాన దోషుల్లో ఒకరికి మరణశిక్ష విధిస్తూ, మిగిలిన ఇద్దరికి కఠిన కారాగార శిక్షలు ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. 2022లో జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే, తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు విలాతికుళానికి చెందిన మునీశ్వరన్ (25) అనే పెయింటర్‌తో ఓ ప్రార్థనా స్థలంలో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త పెళ్లి చేసుకుంటాననే నమ్మకానికి దారితీయడంతో, అతను బాలికను మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టాడు. అనంతరం తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించగా, వారు కూడా బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ చేపట్టిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేష్ కుమార్ సోమవారం తుది తీర్పును వెల్లడించారు. బాలికపై దారుణానికి ఒడిగట్టిన చిన్నకుట్టికి మరణశిక్ష (ఉరిశిక్ష) విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్షలు ఖరారు చేస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

### 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి

# ఐరాస ఆమోదం




**న్యూఢిల్లీ డీసీ**

ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఇటీవల విడుదల చేసిన నూతన ప్రపంచ పటం అంతర్జాతీయంగా, ముఖ్యంగా భారతదేశంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో టోగో దేశం ప్రతిపాదించిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం ఇటీవల ఆమోదించింది. ప్రపంచ భూభాగాల వైశాల్యాన్ని మ్యాప్‌లలో మరింత కచ్చితత్వంతో, సమానత్వంతో చూపించడమే ఈ తీర్మానం యొక్క ప్రధాన ఉద్దేశం. ఇది ప్రధానంగా ఆఫ్రికన్ ఖండపు భౌగోళిక విస్తీర్ణాన్ని సరిగ్గా ప్రతిబింబించేందుకు ఉద్దేశించినది కావడం, చట్టబద్ధమైన నిబంధన కాకపోయినప్పటికీ బహుళపక్ష సంస్థలు తమ ప్రామాణిక పటాల్లో మార్పులు చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ మౌలిక సూత్రానికి అనుగుణంగానే భారతదేశం కూడా ఈ తీర్మానానికి ఓటు వేసి మద్దతు తెలిపింది.

అయితే జులై 1న విడుదల చేసిన ఐరాస నూతన పటంలో అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను భారత్ మరియు చైనాల సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చిత్రీకరించడం వివాదాస్పదంగా మారింది. సాధారణంగా అక్సాయ్ చిన్‌ను లడఖ్‌లో అంతర్భాగంగా భారత్ పరిగణిస్తుంది. కానీ ఈ కొత్త పటంలో అక్సాయ్ చిన్‌కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా సరిహద్దులుగా చూపించారు. అలాగే అరుణాచల్ ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించి, పశ్చిమాన అస్సాం, ఉత్తరాన చైనా సరిహద్దులుగా ఉన్న ప్రత్యేక రాష్ట్రంగా పేర్కొన్నారు. ఈ మార్పులకు గల కారణాలపై ఐరాస ఎటువంటి అధికారిక వివరణ ఇవ్వలేదు. మరోవైపు జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్-పాకిస్తాన్‌ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (రాశీజ)ను చుక్కల రేఖ ద్వారా సూచించారు. దీనిపై స్పష్టతనిస్తూ, సంబంధిత పక్షాల మధ్య జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై ఇంకా పూర్తి అంగీకారం కుదరనందున, ఒప్పందానికి అనుగుణంగా ఉన్న సరిహద్దును సుమారుగా చూపించేందుకే ఈ చుక్కల రేఖను వాడినట్లు మ్యాప్ దిగువన ఐరాస పేర్కొంది.

ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ తక్షణమే స్పందిస్తూ తమ ప్రాతిపదికను తేల్చిచెప్పింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి మద్దతు ఇవ్వడం అనేది కేవలం భౌగోళిక విస్తీర్ణాన్ని సమానంగా చూపే సూత్రానికి మాత్రమే పరిమితమని, దీనిని నిర్దిష్టమైన దేశాల సరిహద్దులకు లేదా ఏదైనా ప్రత్యేక పటానికి ఆమోదంగా భావించకూడదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ మరియు అరుణాచల్ ప్రదేశ్ వంటి ప్రాంతాలు భారత సార్వభౌమ భూభాగంలో అంతర్భాగాలని పేర్కొంటూ, అధికారిక భారత పటానికి విరుద్ధంగా ఉండే తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే ఏ చిత్రణనైనా తాము ఆమోదించబోమని భారత్ తేల్చిచెప్పింది.

## హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో నిత్యం తలెత్తే తీవ్ర ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ మరో భారీ ఎలివేటెడ్ కారిడార్ (ఫ్లైఓవర్) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర ఈ నూతన ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం సుమారు రూ.1,656 కోట్ల అంచనా వ్యయంతో హెచ్ఎండీఏ తాజాగా టెండర్లను ఆహ్వానించింది. అర్హత కలిగిన కాంట్రాక్టింగ్ సంస్థలు ఈ నెల 22వ తేదీలోగా తమ బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. అధికారులు సిద్ధం చేసిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (ఖూ=) ప్రకారం ఈ కారిడార్ నిర్మాణాన్ని రెండు దశల్లో చేపడతారు. మొదటి దశలో ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కిలోమీటర్ల మార్గాన్ని, రెండో దశలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హకీంపేట్ కుంట వరకు 4 కిలోమీటర్ల మార్గాన్ని నిర్మిస్తారు. ప్రయాణికులు సులభంగా ఎక్కడానికి, దిగడానికి వీలుగా ఫిలింనగర్ రోడ్డు నంబర్ 82, నార్నె రోడ్డు, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 52, ఐటీసీ కోహినూర్ రోడ్డు, టీ-హబ్ జంక్షన్ మరియు మైండ్‌స్పేస్ జంక్షన్ల వద్ద మొత్తం ఆరు ర్యాంప్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

# ఇజ్రాయిల్‌కు ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ డీసీ**

అంతర్జాతీయ వేదికపై ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లతో వాణిజ్య సంబంధాలపై బ్రిటన్ (యూకే) ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ సెటిల్‌మెంట్ల నుంచి వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతులతో పాటు ఫైనాన్సింగ్, నిర్మాణ రంగం వంటి సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బ్రిటన్ తీసుకున్న ఈ కీలక నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా దేశాలు సైతం మద్దతు తెలుపుతూ తాము కూడా ఈ నిషేధంలో భాగస్వామ్యం కానున్నట్లు వెల్లడించాయి. వెస్ట్ బ్యాంక్‌లోని పలు ప్రాంతాల్లో పాలస్తీనియన్లపై జరుగుతున్న దాడులు, వారి ఇళ్ల కూల్చివేతలు, మౌలిక సదుపాయాల ధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తూ యూకే విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ ఈ నిర్ణయాన్ని సమర్థించారు.

ప్రధాని ఆండీ బర్న్‌హామ్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇజ్రాయెల్ విషయంలో యూకే తన విదేశాంగ విధానంలో తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో బ్రిటన్ పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

అయితే, బ్రిటన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఇజ్రాయెల్, అమెరికాలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశాయి. ఇది తీవ్రమైన తప్పుడు అంచనా అని, తమ ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ మండిపడ్డారు. యూకే తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే తాము కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ హెచ్చరించగా, ఇజ్రాయెల్‌లోని అమెరికా రాయబారి మైక్ హకబీ ఈ చర్యను యూదు ప్రజలపై చూపిస్తున్న వివక్షగా అభివర్ణించారు. ఈ దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో టెలిఫోన్ ద్వారా సంభాషించారు.

# మరిన్ని నైట్ షిఫ్ట్ బస్సులు

**హైదరాబాద్ డీసీ**

గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, అర్ధరాత్రి వేళల్లో పెరిగిన ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని టీజీఎస్ఆర్టీసీ చేపట్టిన రాత్రిపూట బస్సు సర్వీసులకు విశేష స్పందన లభిస్తోంది. అర్ధరాత్రి వేళల్లో ఉద్యోగులు, విద్యార్థులు మరియు ఇతర వర్గాల ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాన్ని అందించే లక్ష్యంతో సెప్టెంబర్ 1, 2026 నుంచి గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లోని ఆరు ప్రధాన రూట్లలో ఈ నైట్ షిఫ్ట్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. ఈ సర్వీసులు అబిడ్స్, లక్డీకాపూల్, కేర్ హాస్పిటల్, అన్నపూర్ణ, ఉషాకిరణ్, గుట్లబేగంపేట్, కొండాపూర్ క్రాస్ రోడ్, హఫీజ్‌పేట్, లింగంపల్లి, రామచంద్రాపురం, బీరంగుడి మీదుగా పటాన్‌చెరు వరకు నడుస్తున్నాయి.

ఈ సర్వీసులు ప్రారంభించిన కేవలం ఏడు రోజుల్లోనే 9,286 మంది ప్రయాణికులు వీటిని వినియోగించుకున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ విజయం పట్ల నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇదే తరహాలో మరిన్ని కొత్త మార్గాల్లో కూడా నైట్ బస్సులు నడపాలని విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. ప్రయాణికుల డిమాండ్, రద్దీ ఆధారంగా రూట్లను సమగ్రంగా పరిశీలించి భవిష్యత్తులో మరిన్ని ప్రధాన మార్గాల్లో థర్డ్ షిఫ్ట్ సర్వీసులను విస్తరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణాను బలోపేతం చేస్తూ, దశలవారీగా 24 గంటలూ అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# హరీశ్‌రావు వాగ్వాదం

తెలంగాణ శాసనసభలో మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి ఆరోపణలు, సభ స్థానానికి జరిగిన అవమానంపై బీఆర్ఎస్ నేత హరీష్ రావు మరియు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై మగ పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, చీరలు లాగి వేధించిన దృశ్యాలు కనిపిస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా తిరిగి ఎమ్మెల్యేలపైనే కేసులు పెట్టడం దారుణమని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గౌరవసభ కాదని, కౌరవసభగా మారిందని విమర్శించారు.

ఈ వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్రంగా స్పందిస్తూ, "హరీష్ రావు, ఆవేశం నీకు కాదు నాకు ఉండాలి. అవమానం జరిగింది నీ తల్లికి కాదు, నా తల్లికి" అని ఘాటుగా బదులిచ్చారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తనకు సోదరీమణులతో సమానమని, కానీ సభలో స్పీకర్ పదవినీ, తన తల్లిని ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. దీనికి సంబంధించి ఎమ్మెల్సీ తాతా మధు స్పందిస్తూ, తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ స్పీకర్ మనస్తాపానికి గురైతే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు.

ఇదే అంశంపై మంత్రి సీతక్క మాట్లాడుతూ, అసెంబ్లీ వద్ద ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ పదవిని దూషించడం, మహిళా పోలీసుల ఎదుట అనుచితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. అయితే, మహిళా ప్రజాప్రతినిధులపై నిజంగానే పోలీసుల దాడి జరిగి ఉంటే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీతక్క స్పష్టం చేశారు.

# ఎర్రవల్లి నివాసం వద్ద తీవ్ర కలకలం

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి నివాసం వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. కాంగ్రెస్ శ్రేణులు డప్పులతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించడంతో, కేసీఆర్‌కు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. తమ నాయకుడిపై హత్యాయత్నానికి కుట్ర జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. నిరసనకారులను ఫామ్‌హౌస్ వరకు అనుమతించి, సొంత నేతను కలిసేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడంపై పోలీసుల వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని, ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఇదంతా చేస్తోందని మండిపడ్డారు.

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. సభలో మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన ప్రవర్తనను ప్రశ్నించినందుకు తమపైనే కేసులు పెడుతున్నారని ఆరోపిస్తూ సీఎంను 'కలియుగ దుశ్శాసనుడు'గా అభివర్ణించారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం తలపెట్టేలా అధికార పక్షం మాట్లాడిస్తోందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు విధించినా తాము ప్రజాక్షేత్రంలోనే పోరాడతామని స్పష్టం చేశారు.

అరెస్ట్ చేసిన నేతలను బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య నినాదాలు, తోపులాట మొదలై చివరకు రాళ్లు, కుర్చీలు విసురుకునే వరకు వెళ్లింది. ఈ పరస్పర దాడుల్లో పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఒక మహిళా కార్యకర్త చేయి విరిగినట్లు సమాచారం. పోలీసులు అదనపు బలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తెచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం ఆయా పోలీస్ స్టేషన్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సీఐడీ పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



**శంకరపట్నం డిసీ ప్రతినిధి**

సిఐడి పోలీసుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలోని, రాజాపూర్ గ్రామానికి చెందిన చిర్ర శ్రీనివాస్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో గత కొన్ని ఏళ్ళ క్రితం ఎంపిక కావడంతో, శ్రీనివాస్ ప్రతిభను గుర్తించిన పోలీస్ శాఖ అధికారులు సిఐడి శాఖలో హైదరాబాద్ పట్టణంలో విధులు నిర్వహిస్తున్న చిర్ర శ్రీనివాస్ సిఐడి పోలీస్ సంక్షేమ సంఘం కు జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. సోమవారం జరిగిన సీఐడీ పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించి తన ఘన విజయం కృషి చేసిన పోలీస్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపి. సిఐడి పోలీసులకు ఇచ్చిన మాట ప్రకారం, పోలీసుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

# తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు ఊరట

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలతో పోలీసులు వారిని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అదుపులోకి తీసుకున్నారు. స్పీకర్ ఓఎస్డీ ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసుల ఆధారంగా వీరిని నాంపల్లి కోర్టులో హాజరుపరచి రిమాండ్ కోరారు.

అయితే ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశిస్తూ ఎమ్మెల్సీలను విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు ఇది రాజకీయ కక్షసాధింపు చర్య అని వాదించగా, నాంపల్లి కోర్టు పూచీకత్తుల సమర్పణ అనంతరం వారిని విడిచిపెట్టడానికి అనుమతించింది.

మరోవైపు ఈ ఘటనపై తెలంగాణ హైకోర్టులోనూ విచారణ కొనసాగుతోంది. ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, బీఆర్ఎస్ నేతలు నిషేధాజ్ఞలు ఉల్లంఘించి నిరసన తెలపడమే కాకుండా విధుల్లో ఉన్న పోలీసులను నెట్టివేశారని, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే స్పీకర్ ఆదేశాల మేరకు పోలీసులు వ్యవహరించారని కోర్టుకు వివరించారు.

# 'నందు'కు నోటీసులు

యూట్యూబర్, 'నందూస్ వరల్డ్' ఛానల్ నిర్వాహకురాలు రమానందన అలియాస్ 'నందు'కు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకుని ఇబ్రహీంపట్నం పోలీసులు నోటీసులు జారీ చేశారు. యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు రెన్యూవల్ చేయిస్తామని పలువురిని మోసగించారనే ఆరోపణలపై నందన, ఆమె భర్త మధుకర్, మామ మోహన్‌రావులపై గతేడాది నవంబర్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో గతంలోనే లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ అయ్యాయి.

సోమవారం లండన్ నుంచి హైదరాబాద్ వచ్చిన నందనను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇబ్రహీంపట్నం పోలీసులు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ఆమెకు 35 బీఎన్ఎస్ కింద నోటీసులు అందించారు. నమోదైన కేసులకు సంబంధించి రెండు రోజుల్లో పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. నోటీసులు అందుకున్న అనంతరం ఆమె అక్కడ నుంచి వెళ్ళిపోయినట్లు పోలీసులు తెలిపారు. గుంటూరుకు చెందిన నందన సోషల్ మీడియాలో విలక్షణమైన గొంతుతో గుర్తింపు పొందడమే కాకుండా 'మన శంకర వరప్రసాద్' సినిమాలోనూ నటించారు.

## రెండో రోజూ నష్టాలు

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరగడం,

# పంచాయతీరాజ్ కమిషనర్ కు వినతి పత్రం అందించి రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం నాయకులు

**సానుకూలంగా స్పందించిన పంచాయతీరాజ్**

**కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్**

**ఉప సర్పంచ్ ల ఫోరం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్**



**శంకరపట్నం డిసి ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బోట్ల కార్తీక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజ్ ఐఏఎస్ ను మంగళవారం హైదరాబాద్ పట్టణంలో కమిషనర్ కార్యాలయంలో కలిసి రాష్ట్ర సంఘం వినతి పత్రాన్ని అందజేసినట్లు కరీంనగర్ జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కేశవపట్నం ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, బోట్ల కార్తీక ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఉప సర్పంచ్ ల చెక్ పవర్, అభివృద్ధి పనులపై, ప్రారంభోత్సవాల శిలాఫలకాలపై ఉపసర్పంచ్ ల పేర్లను, ఉప సర్పంచ్ లకు గౌరవ వేతనం, తీర్మానాల బుక్ లో సంతకాల కోసం రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఓ వినతి పత్రాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజ్ కు అందజేసినట్టు తెలిపారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు-దండ నరేష్ ,ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు-దీపక్ ముండే ,రాష్ట్ర కార్యదర్శి-మట్ట శ్రీనివాస్మ,హిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి-పల్లవి ,మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్-లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాసనమండలి తీవ్ర చర్యలు

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభియోగాలపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై శాసనమండలి తీవ్ర చర్యలు తీసుకుంది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు (సెషన్) ముగిసే వరకు వీరిద్దరినీ శాసనమండలి నుంచి సస్పెండ్ చేస్తూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. అంతకుముందు, శాసనసభలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించి, ఎమ్మెల్సీలపై చర్యల నిమిత్తం శాసనమండలికి పంపించింది. సభా మర్యాదలను ఉల్లంఘించడం, స్పీకర్ స్థానాన్ని అవమానించడంపై శాసనసభ తీవ్ర నిరసన వ్యక్తం చేయడమే కాకుండా, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ తీర్మానం ఆధారంగా శాసనమండలిలో మంత్రి శ్రీధర్ బాబు సస్పెన్షన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, వాయిస్ ఓటింగ్ అనంతరం సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. మంగళవారం ఉదయం నాంపల్లి కోర్టు నుంచి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలైన అనంతరం ఈ ఇద్దరు ఎమ్మెల్సీలు నేరుగా మండలికి హాజరుకాగా, అధికార పక్ష సభ్యుల నిరసన మధ్య ఈ చర్యలు చోటుచేసుకున్నాయి. కాగా, తమ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు పడటంపై బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇది ప్రభుత్వ కక్షసాధింపు చర్య అని ఆరోపిస్తూ మండలి ఆవరణలోనే బైఠాయించి ఆందోళన చేపట్టారు.

**స్కూల్ బస్సులో అకస్మాత్తుగా మంటలు**

**విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం**

హైదరాబాద తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సులోకి విద్యార్థులు ఎక్కుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో తీవ్ర కలకలం రేగింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పిల్లలను బస్సుకు దూరంగా తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకటో తరగతి విద్యార్థులు బస్సు ఎక్కుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. క్షణాల్లోనే మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుంది. పరిస్థితిని గమనించిన సిబ్బంది వెంటనే స్పందించి విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తప్పించుకున్నారు. అయితే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా కాలిపోయి బూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ బస్సుల నిర్వహణ, ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలపై పాఠశాల యాజమాన్యం మరింత శ్రద్ధ పెట్టాలని కోరుతున్నారు. బస్సు సరైన కండిషన్‌లో లేకపోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గతంలోనూ ఇదే పాఠశాలకు చెందిన మరో బస్సు మంటల్లో దగ్ధమైన ఘటన జరిగిందని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలోని అన్ని బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మంటలు చెలరేగిన సమయంలో బస్సులో విద్యార్థులు ఉండి ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదృష్టవశాత్తూ పిల్లలను వెంటనే బస్సు నుంచి దూరంగా తరలించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్కూల్ బస్సుల్లో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అవసరమైన భద్రతా పరికరాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, అత్యవసర ద్వారాలు తదితర ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అనే అంశంపైనా ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనకు